# యాక్సిడెంట్

"అదేటండీ బాబూ... స్కూటర్ ఎంతో జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారు. అలాంటి మూర్తిగారికి యాక్సిడెంట్ అవడమేమిటండీ?!"

కాళ్లకు, చేతులకూ కట్లతో మంచంపై పడివున్న మూర్తిగార్ని పరామర్శించడానికి వచ్చాడు ఆయన కొలీగ్.

మూర్తిని అప్పుడే హాస్పిటల్ నుండి తీసుకురావడంతో ఇంకా మాట్లాడటం లేదు. కట్లు కట్టేటప్పుడు ఇచ్చిన లోకల్ ఎనస్తీషియా, యాక్సిడెంట్ అయిన భయం, నెప్పులు తగ్గడానికి ఇచ్చిన మత్తుమాత్రలు పనిచేస్తుండటంతో... ఇంకా మత్తుగా పడుకునివున్నాడు.

"అవునండీ... అందరూ అదే అంటున్నారు. ఈయన స్కూటర్ మీద ముప్పై కిలోమీటర్ల స్పీడు దాటితే ఒట్టు!' అంది ఆయన శ్రీమతి- మంచం దగ్గరే కుర్చీలో కూర్చుని ఆయన్ని సవరిస్తూ.

"అసలు ఎలా జరిగిందండీ..?"

"నేను చెప్తా అంకుల్..." అంటూ మూర్తిగారి అబ్బాయి అందుకున్నాడు-

"డాడీ ఫ్రెండ్ వస్తే సెండాఫ్ ఇవ్వడానికి బస్‌స్టాండ్‌కి వెళ్లారు. ఫ్రెండ్ ఎక్కాల్సిన బస్ అప్పటికే బయలుదేరిపోతే... దాన్ని ఫాలో అవుదామని వెళ్తుంటే వెనుకనుండి వస్తున్న బస్‌ని తప్పించలేకపోయారు. రెండు కాళ్లకు బలమైన దెబ్బలు తగిలాయి!" క్లుప్తంగా చెప్పాడు.

ఒక గంటకి మూర్తి స్పృహలోకి వచ్చి, "అమ్మా..." అని మూల్గసాగాడు.

వెంటనే గ్లూకోజ్ వాటర్ కలిపి ఇచ్చింది అతడి భార్య.

"ఆఫీసు నుండి ఎవరైనా వచ్చారా..?" అని అడిగాడు తాగుతూ.

"జగ్గు వచ్చాడులెండి! మీరు నిద్రపోతుంటే లేపలేదు. మిమ్మల్ని వివరాలు అడుగుతాడు... చెప్పాలి. ఇదో ఘోష! మీకు ఎలాగూ రెండు రోజులదాకా తప్పదులెండి... వచ్చిన వాళ్ళందరికీ వివరాలు చెప్తుండాలి!"

"మూర్తిగారూ..." అంటూ ముగ్గురు తలుపు కొడితే... తలుపు తీశారు.

లోపలకు వస్తూనే "ఎలావుందండీ... మూర్తిగారికి? చాలా చెడ్డవార్త విన్నాం..."

"బాగానే వుందండి. డాక్టర్ భయంలేదన్నారు..."

"మూర్తిగారూ... అసలు యాక్సిడెంట్ ఎలా జరిగిందండీ?"

అక్కడేవున్న మూర్తి కొడుకు అందుకుని-

"నేను చెప్తా అంకుల్... డాడీని శ్రమ పెట్టకండి!" అంటూ జరిగినదంతా వివరంగా చెప్పాడు.

"బాగుంది సారూ... బాబు సక్కంగ చెబ్తుండు! మీకు జర శ్రమ తప్పినాది!" అంటూ మూర్తి దగ్గర పనిచేసే అటెండర్ చిన్నగా నవ్వాడు.

వచ్చిన ముగ్గురిలో ఒకాయన చాలా దిగులుగా వున్నాడు.

"ఏమిటి అంత దిగులుగా వున్నావు? నెలరోజుల్లో కోలుకుని, మళ్లీ మామూలుగా ఆఫీసుకి వచ్చేస్తాన్లే!" అని అతన్ని సముదాయించబోయాడు మూర్తి.

"అదికాదండీ బాబూ... సుబ్బారావుగార్ని ఎలా సముదాయించాలో అర్థంకావడం లేదు."

"ఏమయింది సుబ్బారావుకి..?"

"మీకు యాక్సిడెంట్ అయ్యిందనీ, ఫాటల్ ఆక్సిడెంటనీ తెలిసి- ఆయనకు మీ ప్లేస్‌లో ప్రమోషన్ వస్తుందని అందరికీ స్వీట్లు పంచేసి, చాలా కులాసాగా భార్యతో సినిమాకు వెళ్లాడు. 'రేప్పొద్దున్న అంత్యక్రియలకు వెళ్దాంలే.., ఇప్పుడు వెళ్లి అందర్నీ ఓదార్చడం- అదీ నేను తట్టుకోలేను, నా హార్ట్ ఫెయిలయినా అవచ్చును' అన్నారండీ!"

"అయితే... నాకు కాళ్లకే దెబ్బలు తగిలాయి కదా!"

"కాని, అందరూ అలా అనుకోలేదండీ!"

"అదేంటి... నేను ఆఫీసుకి ఫోన్ చేయించాను!"

"ఏమోనండీ...నాకు చాలా భయం వేస్తోంది! సుబ్బారావుగారికి అసలే బి.పి., షుగర్, హార్ట్‌ట్రబుల్ వున్నాయండీ! మీరు క్షేమంగానే వున్నారని తెలిస్తే ఏమయిపోతాడో ఊహించుకోవడం కష్టంగా వుందండీ..." అంటూ అతను తెగ బాధపడిపోతున్నాడు.

"చాల్లేవయ్యా... నేను బ్రతికి బట్ట కట్టానని సంతోషించక- సుబ్బారావు గురించి బాధపడతావేమిటి?" చిరుకోపంగా అన్నాడు మూర్తి.

"కాదు సర్... కొన్నాళ్లు ఆయనకు ఈ సంగతి చెప్పకుండా వుంటే బావుంటుందేమో!"

"చాలు చాల్లేవయ్యా... ఇక నోర్మూసుకుని ఇక్కడి నుండి దయచెయ్! నేను సుబ్బారావుకు కబురు చేస్తాలే! వాడికి ఏమైనా ఫర్వాలేదులే!" అంటూ కోపంతో మూర్తి లేవబోయాడు మంచం మీదనుంచి.

ఈలోగా మూర్తి భార్య వచ్చి అందర్నీ బయటకు పంపించేసి తలుపేసింది.

"వెధవలు... బుద్ధి లేదు. నేను చచ్చిపోయాననీ- నా ప్లేస్‌లో ప్రమోషన్ వస్తుందనీ- ఆఫీసులో అందరికీ స్వీట్లు పంచాడట, భార్యతో సినిమాకు వెళ్లాడట, రేప్పొద్దున నా అంత్యక్రియలకు వస్తాడుట... బాస్టర్డ్!"

"చాల్లెండి! కంట్రోల్ చేసుకోండి... పడుకోండి!" నిద్రమాత్ర ఇచ్చింది మూర్తి భార్య.

మర్నాడు- మూర్తి స్నేహితుడు ఒకాయన వచ్చాడు.

"అయ్యో- అయ్యో- మూర్తిగారూ... ఎంత పని జరిగింది? అసలు ఎలా బ్రతికారండీ బాబూ?! ఇలాంటి యాక్సిడెంట్స్‌లో బ్రతకడమే కష్టం! సిస్టర్, పిల్లలూ అదృష్టవంతులు!" వస్తూనే మొదలెట్టాడు.

"భగవంతుని దయ అండీ అన్నయ్యగారూ! నా మాంగల్యం గట్టిది. శుక్రవారంనాడు వరలక్ష్మీదేవి కాపాడింది!" అన్నది మూర్తి భార్య.

"అసలు యాక్సిడెంట్ ఎలా జరిగిందండీ..?"

"నేను చెప్తానంకుల్..." మూర్తి కొడుకు మధ్యలో అందుకుని మళ్లీ మొత్తం చెప్పాడు.

"ఇలాగే ఒకసారి మా చుట్టాలాయనకు యాక్సిడెంట్ అయ్యిందండి. రెండు కాళ్లకు దెబ్బలు తగిలితే కట్టు కట్టారండి. నెప్పులు లేవు కదానని కట్లు చూసుకోలేదండి. అంతే... కాళ్లు సెప్టిక్ అయిపోయి రెండు కాళ్లూ తీసేశారండి. పాపం... చనిపోయాడండి. చాలా జాగ్రత్తగా వుండాలండి. సిస్టర్... మీరు కాస్త కనిపెట్టుకుని వుండండి!"

"ఎవరోయ్ అతను?" అడిగాడు మూర్తి.

"అదేనండి- సుశీల పనిచెయ్యడంలే, మన ఆఫీసులో... ఆమె భర్తే!" అన్నాడతను.

"ఓహోఁ... అలాగా!" అన్నాడు మూర్తి.

"అన్నయ్యగారూ! రేషన్ షాపులో పంచదార ఇస్తున్నారేమో కనుక్కుని కాస్త తెచ్చి పెడతారూ!" అంటూ అతనికి సంచి, కార్డు ఇచ్చి పంపేసింది మూర్తి భార్య.

"ప్రతీ వెధవ రావడం... ఏవో అవాకులూ, చవాకులూ పేలడం, యాక్సిడెంట్ వివరాలు అడగడం! ఇలాగే ఎక్కడో, ఎవడికో యాక్సిడెంట్ అయితే వాడు చచ్చాడని చెప్పడం!! ఒక్కడంటే ఒక్కడు- 'నయమైపోతుంది... ధైర్యంగా వుండండి' అని చెప్పడేం? వెధవలు... ఎవర్నీ రానియ్యకు!" అని పెళ్ళాంతో అన్నాడు మూర్తి.

"మీరు మరీనూ! ఎవర్నీ రానియ్యకుండా ఎలాగండీ? అక్కడికీ బాబిగాడు యాక్సిడెంట్ ఎలా జరిగిందీ తానే చెప్తున్నాడు. ఈ వివరాలు వచ్చిన వాళ్ళందరికీ చెప్పాలని నాలుగు రోజుల్నించి కాన్వెంట్ కూడా మాన్పించేశాను. లేకపోతే మీరో, నేనో చెప్పాల్సివచ్చేది. వాడికి గంటగంటకీ హార్లిక్స్ ఇస్తున్నాను. లేకపోతే పిచ్చికన్న నీరసించిపోగల్డు!" అంది అతని భార్య.

"అంతేలే... మీ అబ్బాయి నీరసించిపోతున్నాడని నీకు దిగులు!" అన్నాడు మూర్తి.

అంతలో... తలుపు తట్టారెవరో!

"అయ్యో మూర్తిగారూ... చీమకు కూడా అపకారం చెయ్యరు మీరు- ఎలా జరిగిందండీ..." గుమ్మంలోంచే సానుభూతి గుమ్మరిస్తూ వచ్చాడొకాయన.

"అంకుల్... నేను చెప్తాను!" బెడ్ పక్కనేవున్న బాబీ ఏటుజెడ్ వివరాలన్నీ చెప్పాడు.

"అసలు మనం ఇలా ఊరుకోకూడదండీ! బస్ మీద కేసు ఫైల్ చేద్దాం. రెండు కాళ్లకీ, వైద్యానికీ మినిమమ్ లక్ష రూపాయలు ఇవ్వాలి. ఎవడబ్బ సొమ్ము? నేను కేస్ డీల్ చేస్తానుండండి. వివరాలు చెప్పండి!" అంటూ జేబులోంచి నోట్‌బుక్ తీశాడు.

ఆయన మూర్తి ఆఫీసులో పనిచేస్తూ రెండు ఎమ్మేలు, యల్.యల్.బీ. చదివి లాయర్ల ఇంటిచుట్టూ తిరుగుతుంటాడు. ఎప్పటికైనా ఒక కేసు టేకప్ చేసి గెలవాలని అతని తాపత్రయం. ఇకనేం... మూర్తి కేసు దొరికింది.

"అన్నయ్యగారూ... ముందు కాఫీ తాగండి!" మూర్తి భార్య కాఫీ తీసుకొచ్చింది.

మూర్తి కోపం తారాస్థాయికి చేరుకుంది. "ఇందాకటి నుండి కాఫీ ఇవ్వమంటే బ్రూ లేదన్నావ్. కాఫీ ఎందుకు చేశావ్?" విరుచుకుపడ్డాడు.

"ఇంతమంది వచ్చారు... అన్నయ్యగారిలా డబ్బు వచ్చే మార్గం ఎవరైనా చెప్పారా? చూడండి అన్నయ్యగారూ... వివరాలు బాగా రాసుకుని కేసు ఫైలు చెయ్యండి. లక్ష వస్తే మీకు పదివేలు ఇచ్చుకుంటాం!" అంది.

"అలాగే..." అని అన్నీ రాసుకుని వెళ్లిపోయాడు.

అతను వెళ్లగానే "ఏమండీ... మనకు నిజంగా లక్షరూపాయలు వస్తాయా? డబ్బు మిగిలితే నాకు కెంపుల నెక్లెస్, బాబిగాడికి సన్నీ కొనాలండీ! మీ యాక్సిడెంట్ పుణ్యమాని..." అంటూ ఆమె ఇంకా ఏదో అనబోతూంటే-

"ఛ... నోర్ముయ్!" అని కసురుకున్నాడు మూర్తి. "వాడి సంగతి నీకు తెలియదు. వాడు ప్లీడరు కాదు. మా ఆఫీసులో గుమాస్తా. లా చదివి, లాయర్ల చుట్టూ తిరుగుతుంటాడు."

"ఓస్ః... అంతేనా? మంచి ఫిల్టర్ కాఫీ కలిపి ఇచ్చానే!"

"ఏదో ముతక సామెత చెప్పినట్టు- యాక్సిడెంట్ అయి రెండుకాళ్లు దెబ్బలు తగిలి నేనేడుస్తుంటే... నేను బ్రతకడం వలన ప్రమోషన్ పోయిందని ఒకడు, సెప్టిక్ అయితే కాళ్లు తీసేస్తారని మరొకడు, కోర్టులో కేసు పెడితే లక్ష రూపాయలు వస్తాయని ఇంకొకడు- చచ్చిపోతున్నాననుకో!" మూర్తి బాధ చూడలేకపోయింది అతని భార్య.

ఈలోగా "డాడీ... ఇదిగో!" అంటూ ఒక కేసెట్ తీసుకుని వచ్చాడు బాబీ.

"ఏమిటిరా కన్నా?" అంది తల్లి.

"అదికాదు మమ్మీ! నేను రేపటినుండి కాన్వెంట్‌కి వెళ్లిపోవాలి కదా... యాక్సిడెంట్ వివరాలు ఎవరైనా అడిగితే డాడీ, నువ్వూ చెప్పక్కర్లేదు. ఈ కేసెట్ ప్లే చెయ్యండి చాలు! నా మాటలు రికార్డ్ చేశాను!" అంటూ కేసెట్, టూ ఇన్ వన్‌లో పెట్టి ఆన్ చేశాడు.

"మా డాడీ ఫ్రెండ్ వస్తే..." మొదలైంది కథ.

"ఆపురా ఆపు!" అంటూ మూర్తి కసిరాడు.

"ఏమేః... ఏం చేస్తున్నావ్? ఇలా రా!" అంటూ అరిచాడు.

"ఏం కొంప మునిగిదండీ! రోజూ ఉదయం ఆఫీసుకు వెళ్తే రాత్రి ఏడుగంటల దాకా వచ్చేవారు కాదు. నా ప్రాణం హాయిగా వుండేది. వారంరోజుల్నించి మీకు సపర్యలు చేయలేక ఛస్తున్నా!" అంటూ వచ్చింది.

"వీధి గుమ్మానికి తాళంకప్పు తగిలించు. మన పక్కింటోళ్ళకి- ఎవరైనా వస్తే మనం ఊరెళ్లామని చెప్పమను. నేను ఈ చిత్రహింస భరించలేను."

"వెల్‌సెడ్ డాడీ! మనకు గోల తప్పుతుంది. అమ్మకు టీలు పెట్టడం, వచ్చిన వాళ్ళందరితోనూ నాకు వాగడం తప్పుతుంది!" అన్నాడు బాబీ.

వాడు చెప్పింది కూడా నిజమే!

●

'స్వాతి' వారపత్రిక ... 4 ఫిబ్రవరి' 2000 సంచికలో ప్రచురితం